


ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టిన రోజును పురస్కరించుకుని శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్సీలు వాణీదేవి, నవీన్‌కుమార్‌రెడ్డి


నమస్తే తెలంగాణ

రంగారెడ్డి

I | హైదరాబాద్, శుక్రవారం 14 మార్చి 2025 | RANGAREDDY


# ఆ ఆరు గ్రామాలపై అయోమయం !



- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన ఫ్యూచర్‌సిటీలో కలువనున్న యాచారం, కందుకూరు మండలాలు
- యాచారంలోని 24 జీపీల్లో 21.. కందుకూరులోని 18 జీపీల్లో 15 గ్రామాల విలీనం
- మా ఊర్ల భవిష్యత్తు ఏమిటంటూ ఆయా గ్రామస్తుల ఆందోళన

రంగారెడ్డి, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీ ఏర్పాటును ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో అధికారులు భూముల సేకరణలో నిమగ్నమయ్యారు. కాగా యాచారం మండలంలోని 24 గ్రామాల్లో 21 గ్రామాలు, అదేవిధంగా కందుకూరు మండలంలోని 18 గ్రామాల్లో 15 జీపీలు కందుకూరు, దాసర్లపల్లి, అన్నోజిగూడ, గూడూరు, దెబ్బడగూడ, గుమ్మడవెల్లి, కొత్తూరు, గఫూర్‌నగర్, లేమూర్, మాదాపూర్, మీర్‌ఖాన్‌పేట, ముచ్చర్ల, పంజాగూడ, రాచులూరు, తిమ్మాపూర్ వంటి గ్రామాలు ఫ్యూచర్‌సిటీలో కలుస్తుండడంతో తమ ఆరు గ్రామాల పరిస్థితి, భవిష్యత్తు ఏమిటంటూ స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తమ గ్రామాలకు యాచారం, కందుకూరు మండలాలే ఉంటాయా..? లేదా.. ఇతర మండలాల్లో విలీనం చేస్తారా..? అని చర్చించుకుంటున్నారు.

### పట్టణ ప్రాంతంగా జిల్లా..

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) తన పరిధిని పెంచడంతో ఇక నుంచి జిల్లా మొత్తం పట్టణ ప్రాంతంగా మారనున్నది. జిల్లాలోని 16 మున్సిపాలిటీలు, 2 కార్పొరేషన్లు, 21 మండలాల్లో 13 మండలాలూ హెచ్‌ఎండీఏ పరిధిలోనే ఉన్నాయి. కొత్తగా హెచ్‌ఎండీఏ తన పరిధిని విస్తృతం చేయడంతో ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి, కొందుర్గు, కేశంపేట, చౌదరిగూడ, పారూఖ్‌నగర్ మండలాలు కూడా దాని ఆధీనంలోకే వెళ్లిపోయాయి. కాగా, ఇక నుంచి జిల్లాలోని పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఎలాంటి అనుమతులైనా హెచ్‌ఎండీఏ నుంచే పొందాల్సి ఉంటుంది. ఇక నుంచి ఇండ్ల నిర్మాణంతోపాటు పరిశ్రమలు, ఇతరత్రా అన్ని నిర్మాణాలకు హెచ్‌ఎండీఏ నుంచే పొందాల్సిందే.

# కాంగ్రెస్ తెచ్చిన కరువు

## ప్రాజెక్టుల నిండా నీరున్నా.. ఎండుతున్న పంటలు

### తూములు, కాల్వలు పాడైనా పట్టించుకోని సర్కార్

- వికారాబాద్ జిల్లాలోని తొమ్మిది చిన్న, మధ్యతరహా ప్రాజెక్టుల నిర్వహణపై నిర్లక్ష్యం
- కోట్‌పల్లి ప్రాజెక్టు నవీకరణకు నయా పైసా విదల్చని రేవంత్ ప్రభుత్వం
- ఎండుతున్న పంటలతో అన్నదాతల కన్నీరు

అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది జిల్లాలోని ప్రాజెక్టుల పరిస్థితి. జిల్లాలో తొమ్మిది చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులు నీటితో నిండి ఉన్నా.. ఒక్క ఎకరానికీ సాగు నీరందని దుస్థితి నెలకొన్నది. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే ఇందుకు కారణమని అన్నదాతలు మండిపడుతున్నారు. కాగా 1.57 టీఎంసీల సామర్థ్యంగల కోట్‌పల్లి ప్రాజెక్టులో ప్రతిఏటా నీటి నిల్వలు సరిపడా ఉన్నా ఆ ప్రాజెక్టు కాల్వలు పూర్తిగా దెబ్బతినడం, తూములు కొట్టుకుపోవడం, బ్రిడ్జిలు కూలిపోవడంతో దాని కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరందని పరిస్థితి నెలకొన్నది.

- వికారాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ)



తాండూరు : ఎండిన పంటను చూస్తూ పొలంలో దిగాలుగా కూర్చున్న పెద్దేముల్ మండలంలోని రేగొండి గ్రామానికి చెందిన వెంకటయ్య

## ఒక్క ఎకరాకూ అందని సాగునీరు..

జిల్లాలోని తొమ్మిది చిన్న, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన తూములు, కాల్వలు పూర్తిగా దెబ్బతినడంతో పాటు పూడికతీత పనులు చేపట్టకపోవడంతో వాటిలో సమృద్ధిగా నీరున్నా రైతులు తమ పొలాలకు నీటిని వాడుకోలేక పోతున్నారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఒక్కసారి కూడా నవీకరణ పనులు చేపట్టలేదు. జిల్లాకు సాగు నీరందించే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలోని చిన్న, మధ్యతరహా ప్రాజెక్టుల నిర్వహణను కూడా గాలికి వదిలేసిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టు అయిన కోట్‌పల్లి ప్రాజెక్టుకు గత రెండు, మూడేండ్లుగా భారీగా వరద వస్తున్నది. అయితే, ప్రాజెక్టు కింద ఉన్న కాల్వలన్నీ కొట్టుకుపోవడంతో ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందడం లేదు. ఈ ప్రాజెక్టు ద్వారా తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల్లోని 18 గ్రామాలకు సాగునీరు అందించాల్సి ఉన్నది. యాసంగి పంటల సాగు ప్రారంభమైనా ఇంకా ఆయకట్టు కింద ఉన్న పంటలకు సాగు నీరందించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచించకపోవడం శోచనీయం. 15 నెలల కాంగ్రెస్ పాలనలో కోట్‌పల్లి ప్రాజెక్టు మరమ్మతులకు సంబంధించి దాదాపు 10 సార్లు అంచనాలను తయారు చేయడం, మార్పులు చేయడం తప్ప ఇప్పటికీ నయాపైసా విడుదల చేయలేకపోయారు. ఎన్నికలకు ముందు తమను గెలిపిస్తే కోట్‌పల్లి ప్రాజెక్టు నవీకరణకు కృషి చేస్తామని హామీనిచ్చిన తాండూరు, వికారాబాద్ ఎమ్మెల్యేలు ఏడాదిన్నర అవుతున్నా పట్టించుకోవడంలేదని రైతులు, ప్రజలు మండిపడుతున్నారు.

కోట్‌పల్లి ప్రాజెక్టులో పుష్కలంగా నీరుండడంతో నీటిని విడుదల చేస్తారనే ఆశతో పంటలను సాగు చేస్తే ఇప్పుడు విడుదల చేయకపోవడంతో తమ పంటలు ఎండిపోతున్నాయని వారు కన్నీరు పెట్టుకుంటున్నారు. సాగుకు వెచ్చించిన పెట్టుబడి రాని పరిస్థితి నెలకొన్నదని.. అప్పులను ఎలా తీర్చాలో అర్థం కావడంలేదని వాపోతున్నారు.



నీటితో కళకళలాడుతున్న కోట్‌పల్లి ప్రాజెక్టు

### పంట ఎండిపోతున్నది..



ఎకర నుంచి రెండు ఎకరాల వరకు వరి పంట వేశాం. సాగు నీరు అందక పొట్ట దశలో ఉన్న పంట ఎండిపోతున్నది. కోట్‌పల్లి ప్రాజెక్టు నుంచి నీరు వచ్చి ఉంటే బాగుండేది. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు వేసి సకాలంలో కోట్‌పల్లి ప్రాజెక్టు నుంచి నీటిని కొండాపూర్ చెరువులోకి వదిలితే పంటలు ఎండిపోయే పరిస్థితి రాకుండే. పంటల ఎండిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

-గజ్జల నర్సింహులు, కూర రమేశ్, రేగొండి, పెద్దేముల్

### రైతులను పట్టించుకోవడం లేదు..



కొండాపూర్ చెరువులో నీళ్లు లేక సుమారు 70 ఎకరాల వరి పంట ఎండిపోతున్నది. కోట్‌పల్లి ప్రాజెక్టులో నీరు ఉన్నా వాడుకోలేని దర్భర స్థితి నెలకొన్నది. రైతులను పట్టించుకునే నాథుడే లేడు. మాది రైతు ప్రభుత్వమని ఉపన్యాసాలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు పత్తా లేరు. ఇప్పటికైనా రైతుల గోస విని ఆదుకోవాలి.

-కోనేరు సాయిలు, రైతు, పెద్దేముల్

### కాల్వలో పిచ్చిమొక్కలు పెరిగాయి



కోట్‌పల్లి ప్రాజెక్టులో నీరున్నా పంటలకు అందని పరిస్థితి నెలకొన్నది. నేను రెండు ఎకరాల్లో వరి పంట వేశా. బోరు బావిలో నీరు లేక పంట ఎండిపోయింది. కోట్‌పల్లి ప్రాజెక్టు కాల్వలు మొత్తం పూడుకుపోయి, పిచ్చి మొక్కలు పెరిగాయి. రైతులంతా కలిసి ప్రధాన కాల్వలో పూడిక తీశాం. కానీ, నా పొలం వరకు కోట్‌పల్లి ప్రాజెక్టు నీరు రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోట్‌పల్లి ప్రాజెక్టు ద్వారా నీటిని అందించాలి.

– పుల్లమోల్ల శ్రీనివాస్, జనగాం గ్రామం

### ప్రాజెక్టుల కింద ఆయకట్టు.. 23,747 ఎకరాలు

జిల్లాలో కోట్‌పల్లి, లక్నాపూర్, జుంటుపల్లి, సర్పన్‌పల్లి, నందివాగు, శివసాగర్, అల్లాపూర్, కాక్రవేణి, కొంశెట్టిపల్లి ప్రాజెక్టులు ఉన్నాయి. ఆయా ప్రాజెక్టుల ద్వారా 23,747 ఎకరాలకు ఆయకట్టు ఉందని జిల్లా నీటిపారుదల శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. కోట్‌పల్లి ప్రాజెక్టు ద్వారా 9,200 ఎకరాలు, సర్పన్‌పల్లి ప్రాజెక్టు కింద 3,285, నందివాగు ప్రాజెక్టు కింద 1,900, జుంటుపల్లి ప్రాజెక్టు కింద 2,082, శివసాగర్ ప్రాజెక్టు కింద 1000, అల్లాపూర్ ప్రాజెక్టు కింద 1,414, కొంశెట్టిపల్లి ప్రాజెక్టు కింద 1,073, కాక్రవేణి ప్రాజెక్టు కింద 1,326, లక్నాపూర్ ప్రాజెక్టు కింద 2,469 ఎకరాల ఆయకట్టు ఉన్నది. అయితే.. వాటి కాల్వలు పూర్తిగా పాడై సాగునీరు అందడం లేదు. ఆ విషయంలో ప్రభుత్వం, అధికారులు శ్రద్ధ చూపడంలేదని అన్నదాతలు మండిపడుతున్నారు. అంతేకాకుండా ప్రాజెక్టుల నిర్వహణను ప్రభుత్వం గాలికి వదిలేయడంతో సంబంధిత ప్రాజెక్టుల కాల్వలు, తూములు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్పన్‌పల్లి, శివసాగర్, లక్నాపూర్ ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు సాగు నీరందించడం ఏమోకాని సంబంధిత ప్రాజెక్టుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సర్పన్‌పల్లి ప్రాజెక్టును ఆనుకొని వెలిసిన రిసార్ట్స్‌ల నిర్వాహకులు చెరువులో బోటింగ్ దందా చేస్తూ చుక్క నీటిని కూడా రైతులకు వదలనివ్వకుండా అక్రమ వ్యాపారం చేస్తూ రైతులకు నష్టం కలిగిస్తున్నారు.

| ప్రాజెక్టులు | నీటి నిల్వ సామర్థ్యం (మీటర్లలో) | ప్రస్తుత నీటినిల్వలు (మీటర్లలో) | ఆయకట్టు (ఎకరాల్లో) |
|---|---|---|---|
| కోట్‌పల్లి | 514.78 | 512.67 | 9200 |
| సర్పన్‌పల్లి | 564.49 | 561.75 | 3285 |
| నందివాగు | 580.08 | 578.35 | 1900 |
| జుంటుపల్లి | 475.49 | 469.85 | 2082 |
| శివసాగర్ | 458.3 | 456.8 | 1000 |
| అల్లాపూర్ | 101.8 | 100.98 | 1414 |
| కొంశెట్‌పల్లి | 570.8 | 569.35 | 1073 |
| లక్నాపూర్ | 550.5 | 549.5 | 2469 |
| కాక్రవేణి | 521.2 | 518.17 | 1326 |



కోట్‌పల్లి ప్రాజెక్టు కాల్వలో పూడిక తీయకపోవడంతో పెరిగిన పిచ్చి మొక్కలు



బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన పూడికతీత, కాల్వల అభివృద్ధి పనులతో వర్షపు నీరు చేరి అలుగు పారుతున్న ఇబ్రహీంపట్నం పెద్దచెరువు

# నాడు కళ కళ .. నేడు వెలవెల..

### రెండేండ్ల క్రితం నీటితో కళ కళ లాడిన పెద్దచెరువు పరిసర గ్రామాలు

- నేడు ఎండిపోయి ఎడారిగా..

ఇబ్రహీంపట్నం, మార్చి 13 : ఇబ్రహీంపట్నం ప్రాంత ప్రజల స్థితిగతులను శాసించే ఇబ్రహీంపట్నం పెద్దచెరువు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మిషన్ కాకతీయ పథకం కింద చేపట్టిన పూడికతీత పనులు, పెద్దకాల్వ, రాచకాల్వల మరమ్మతులకు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కోట్లాది రూపాయల నిధులు వెచ్చించారు. గతంలో పూర్తిగా ఎండిపోయిన ఇబ్రహీంపట్నం పెద్దచెరువు రెండేండ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు అలుగు పారి నీటితో కళకళలాడింది. దీంతో ఇబ్రహీంపట్నం, శేరిగూడ, రాందాస్‌పల్లి, ఉప్పరిగూడ, పోచారం, తుర్కగూడ, కర్ణంగూడ, చర్లపటేల్‌గూడ, కప్పాడు, ఎలిమినేడు, మంగల్‌పల్లితో పాటు చెరువు చుట్టూ సుమారు 50 కిలోమీటర్ల దూరంలో భూగర్భజలాల నీటిమట్టం పెరిగి రైతుల బోరుబావుల్లో నీరుచేరి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా వ్యవసాయాన్ని చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందారు. అలాగే, మత్స్యకారులు చేపపిల్లలతో జీవనోపాధి పొందారు. గత ప్రభుత్వంలో నీటితో కళకళలాడిన పెద్దచెరువు ప్రస్తుతం పూడికతీత, వాగులు, కాల్వల మరమ్మతులు చేపట్టకపోవడంతో ఎండుముఖం పడుతున్నది. దీంతో ఈ ప్రాంత రైతులు, మత్స్యకారులు ఇబ్బందులకు గురవుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వమే ఉంటే ఇప్పటికే ఇబ్రహీంపట్నం పెద్దచెరువుకు శివన్నగూడ ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించి పుష్కలంగా నీరుండేది. గతంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఇబ్రహీంపట్నం ప్రాంతంలో పర్యటించినప్పుడు ఇబ్రహీంపట్నం పెద్దచెరువును నీటితో నింపి ఎప్పుడు కళకళలాడేలా రాచకొండ ఎత్తిపోతల పథకం ద్వారా నీటితో నింపుతానని హామీ ఇచ్చారు. ఈసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడితే నూటికి నూరు శాతం పెద్దచెరువుకు నీరు చేరేదని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొంటున్నారు.



నీరులేక ఎండుముఖం పట్టి ఎడారిని తలపిస్తున్న పెద్దచెరువు పరిసర ప్రాంతాలు

# భయపెడుతున్న బడి

- ప్రమాదపుటంచున విద్యార్థుల చదువు
- శిథిలావస్థకు చేరిన రాళ్లచిట్టంపల్లి ప్రాథమిక పాఠశాల

వికారాబాద్, మార్చి 13 : విద్యార్థుల చదువు భయం..భయంగా సాగుతున్నది. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో ఆ శ్లాబ్ పెచ్చులు ఊడి ఎప్పుడు తమపై కూలుతాయోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని రాళ్లచిట్టంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదోతరగతి వరకు ఉన్నది. ఇక్కడ 34 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఆ భవనాన్ని తొలగించి కొత్త భవనాన్ని నిర్మించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కలెక్టర్, డీఈవోలకు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.



పెచ్చులు ఊడిన భవనంలోనే చదువుకుంటున్న విద్యార్థులు

# అధికారులకు టార్గెట్లు..

- పన్ను వసూళ్లపైనే ఫోకస్
- సిబ్బందికి సెలవులు రద్దు

సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ): ఆస్తి పన్ను నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించేందుకు జీహెచ్‌ఎంసీ అపసోపాలు పడుతున్నది. మరో 17 రోజుల్లో ఆర్థిక సంవత్సరం గడువు ముగియనున్నది. ఈ క్రమంలో 12.70 లక్షల మంది నుంచి రూ. 1,570 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకున్నది. మరో రూ.430 కోట్ల వసూళ్లు రావాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలోనే ట్యాక్స్ కలెక్షన్స్‌కు సంబంధించిన అధికారులు, సిబ్బందికి సెలవులను రద్దు చేసింది.

### వన్ పాయింట్ ప్రోగ్రాం..

హోలీ, రంజాన్, ఉగాది పండుగలు తదితర అన్ని రకాల సెలవులు రద్దు చేసుకుని ఆస్తిపన్ను వసూళ్లపై ఫోకస్ పెట్టేలా బల్దియా అధికారుల దిశానిర్దేశం చేసింది. ఈ నెలాఖరు వరకు ఇతర పనుల జోలికి వెళ్లకుండా ఆస్తిపన్ను వసూళ్లపై వన్ పాయింట్ ప్రోగ్రాం కింద తీసుకుని పనిచేయాలని ఆదేశించింది. అంతకుముందు జోన్ల వారీగా ఐదు లక్షల బకాయిదారుల జాబితాను రూపొందించి వారిపై అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. అయితే ఆశించిన స్థాయిలో వసూళ్లు రాకపోవడంతో ఈ నెల 7న ఆస్తిపన్ను బకాయిదారులకు ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఓటీఎస్ ద్వారా రోజుకు ఆస్తి పన్నులో వేగం పెరుగుతుందని భావించారు. కానీ ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకునేందుకు పెద్దగా బకాయిదారులు ముందుకు రావడం లేదు. ఈ మేరకు ఓటీఎస్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, కనీసం రూ. 300 కోట్లు ఓటీఎస్ వసూళ్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డీసీలకు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బకాయిలపై దృష్టి సారించి సంబంధిత శాఖలను నోటీసులు ఇవ్వనున్నారు. మొత్తంగా ప్రజా సమస్యలను పక్కన పెట్టి ఆస్తిపన్ను కలెక్షన్లు టార్గెట్‌గా అధిగమించేందుకు అధికారులు పనిచేయనున్నారు.